క్లుప్తంగా

పూడికతీత పనుల పరిశీలన

కాకినాడ: స్థానిక 33వ డివిజన్ రామకృష్ణారావుపేట ప్రాంతంలో పూడిక తీత పనులను నగరపాలక సంస్థ ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు మంగళవారం పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. అలాగే తడి-పొడి చెత్త సేకరణను, చెత్తను విభజించి ఇస్తున్న విధానాన్ని పర్యవేక్షించారు.

మొదటి విడతగా 22,818 పాఠ్య పుస్తకాల రాక


పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఏఎంఓ రామరెడ్డి, ఎంఈఓ బుల్లి కృష్ణవేణి, హెచ్ఎం లీలామనోహర్

కరప: మండలానికి 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి మొదటివిడతగా 22,818 పాఠ్యపుస్తకాలు వచ్చినట్టు సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి (ఏఎంఓ) ఎంవీ రామారెడ్డి, ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి తెలిపారు. జగనన్న విద్యాకానుక మండల స్టాక్‌పాయింట్ స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నతపాఠశాలకు పాఠ్యపుస్తకాలు రాగా, వాటిని భద్రపరచినట్టు తెలిపారు. వేసవి సెలవులు ముగిశాక పాఠ్యపుస్తకాలను అందజేయనున్నట్టు ఎంఈఓ తెలిపారు. హైస్కూలు హెచ్ఎం యు.లీలామనోహర్, సీఆర్పీలు పి.రాజు, బి.సారాకుమారి, పి.సత్యనారాయణ, పి.సునీత, వై.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన


హెల్మెట్ ధారణపై అవగాహన ప్రదర్శన చేపడుతున్న ట్రాఫిక్ పోలీసులు

కాకినాడ క్రైం: కాకినాడ ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ ధారణపై చోదకులకు అవగాహన కల్పించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం ప్లకార్డులు ప్రదర్శించి హెల్మెట్ ప్రాధాన్యాన్ని వివరించారు. రోడ్డు ప్రమాదాలు సంభవించే వేళ హెల్మెట్ ధరించి ప్రాణాలు నిలుపుకున్న పలువురు చోదకుల ఉదంతాలను ప్రస్తావించారు. సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొని అవగాహన ప్రదర్శన చేపట్టారు.

వైభవంగా జలాధివాసం


జలాధివాసంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో అష్టలక్ష్మీ సమేత లక్ష్మీ నారాయణ స్వామి ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్ల జలాధివాసం నిర్వహించారు. అత్యంత భక్తి శ్రద్ధలతో రుత్వికులు, భక్తులు దాతలు ఆధ్వర్యంలో ఉదయం భగవదారాధన, బాలభోగ మంగళాశాసనములు, విన్నపాలు తదితర ప్రక్రియలు నిర్వహించారు. అనంతరం జలాధివాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్

కాకినాడ సిటీ: పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం కాకినాడలో ఓ హోటల్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపు నిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పీఎస్ నారాయణ, తోకల ప్రసాద్, పి.సత్యనారాయణ, టి.అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

కరప: ఇటీవలి వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టీడీపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట నవీన్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి తదితరులు కరపలో మంగళవారం ధర్నా చేశారు. తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి మొలక వచ్చిన ధాన్యంతో అక్కడ ధర్నా చేశారు. అనంతరం రైతులను ఆదుకోవాలంటూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీఎమ్మెల్యే వనమాడి కొండబాబు, పార్టీ రాష్ట్రకార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉన్న ఓపికా పోయె!


క్యాన్సర్ వార్డు ఆవరణలో మండుటెండలో భోజనాల కోసం రోగుల బంధువులు, రోగుల పడిగాపులు


పరీక్షల నిర్వహణ కోసం బారులు తీరిన రోగులు

- జీజీహెచ్‌లో అడుగడుగునా అవస్థలు
- వరుసలో నిరీక్షించలేక తిప్పలు
- శోష వచ్చేలా ఎండలోనూ వరసలే
- ప్రత్యామ్నాయంతోనే ప్రాణం నిలిచేది

కాకినాడ క్రైం: ఒక వ్యక్తి ఆస్పత్రికి వచ్చాడంటేనే ఏదో అస్వస్థతతో వస్తాడు. అక్కడకు వెళ్లినా అదే వరస్సైతే ఉసూరుమని ఏ గోడకో వేలాడడం తప్ప ఏమీ చేయలేని దుస్థితి. ఏ వార్డు దగ్గర, ఏ కౌంటర్‌కు వెళ్లినా ఇదే వరస, నిరీక్షణ తప్పని పరిస్థితి.

నాలుగు వేల మందికి నాలుగే కౌంటర్లు

జీజీహెచ్‌లో ఓపీ పొందడం ఓ ప్రయాస. అక్కడే ఉన్న ఓపికంతా నశించిపోతుంది. షెడ్‌లలో బారులు తీరుతున్న రోగులు పలుమార్లు నీరసించి కుప్పకూలిపోతున్నారు. రోజులో సరాసరి 4 వేల మంది ఓపీ సేవలు పొందుతుంటారు. వారికి ఓపీ రిజిస్ట్రేషన్ చేసి టికెట్లు ఇచ్చేందుకు కేవలం నాలుగే కౌంటర్లు మాత్రమే ఉండడం శోచనీయం.

కడుపు నిండాలంటే కాళ్లు కాలాల్సిందే..

భోజనాల సరఫరా మరో ప్రహసనం. జీజీహెచ్‌లో నిర్ణీత వ్యవధిలో పలు వార్డుల ఆవరణలో భోజనాలు వడ్డిస్తారు. అందుకూ వరుసలు తప్పడం లేదు. భోజనాల కోసం వేచి ఉండే వారిలో రోగుల బంధువులే ఎక్కువ. కడుపు నిండాలంటే కాళ్లు కాలాల్సిన పరిస్థితి.

పరీక్షలే అసలు పరీక్ష

ల్యాబ్‌లో రక్త, మూత్ర, మల పరీక్షలు చేయించాలంటే రోగుల నరకం చూస్తున్నారు. ఉన్న వరసలోనే తోపులాట తప్పడం లేదు. ఏడవ నంబర్ విభాగంతో పాటు అత్యవసర విభాగం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్ వద్దా అదే పరిస్థితి ఎండలో ఎండుతూ, వానలో నానుతూ వారు లైన్‌లో నిరీక్షిస్తుంటారు.

మందుల వద్దా అంతే

వైద్యులు రాసిన మందులు తీసుకోవాలన్నా నీరసంతో పడిగాపులు పడాల్సిందే. మందుల కోసం మూడు కౌంటర్లు ఏర్పాటు చేసినా ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్రత్యేకించి ఏర్పాటు చేసిన షెడ్లు ఎండ తాపం నుంచి విముక్తి కలిగిస్తున్నా పడిగాపులు మాత్రం పరిపాటిగా మారాయి.

ఇలా చేస్తే మేలు..

- రోగుల రద్దీకి అనుగుణంగా మందులు, ఓపీల వద్ద కౌంటర్లు పెంచడం
- విభాగాల వారీగా ఓపీలు జారీ చేయడం
- ప్రతి కౌంటర్ వద్ద కుర్చీల ఏర్పాటు
- ఎండ, వాన నుంచి రక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక షెడ్‌లను నిర్మించడం
- రోగులు మందులు తీసుకోవడానికి పడే ప్రయాసను అధిగమించేందుకు మందుల సరఫరా నేరుగా రోగికి అందేలా చేయడం
- వేచి ఉండే ప్రదేశాల వద్ద తాగు నీటి ఏర్పాటు కల్పించడం
- వేచి ఉండే వరుస వద్ద ఫ్యాన్లు ఏర్పాటు చేయడం

సహకరిస్తే సమస్యలకు పరిష్కారం



అత్యుత్తమ వైద్య సేవలకు నిలయంగా జీజీహెచ్ అభివృద్ధి చెందిన నేపథ్యంలో రోగుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. పలు కౌంటర్ల వద్ద రోగులు వేచి ఉండే సమస్యను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. ఈ లోపు స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ దిగ్గజాలు ముందుకు సహకరించి కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తే కొంత ఉపశమనం కలుగుతుంది. మందులు, ఓపీ, ల్యాబ్‌ల వద్ద కౌంటర్ల పెంపునకు చర్యలు తీసుకుంటాం. ఆయా విభాగాలను పర్యవేక్షిస్తున్న అధికారులను ఆ దిశగా ఆదేశిస్తాం.

– డాక్టర్ హేమలతాదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్

సమగ్రంగా అసెస్మెంట్ల సర్వే

- 15 రోజుల్లో పూర్తికావాలి
- అధికారులకు కమిషనర్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మహేష్ కుమార్

కాకినాడ: నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న నివాసాలు, కుటుంబాలు, వ్యాపార సంస్థల సమాచారంతో సమగ్ర సర్వే చేపట్టాలని కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. 15 రోజుల వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో మంగళవారం ఈ అంశంపై ప్రత్యేక, నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ అసెస్మెంట్‌ల వారీగా యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారా అని తెలుసుకోవాలని తెలిపారు. ఏడీసీ నాగ నాగ నరసింహారావు మాట్లాడుతూ సర్వే ప్రక్రియను నోడల్ అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని, సర్వేకు ఆయా సచివాలయాల అడ్మిన్లు, వలంటీర్లు, ఇతర సిబ్బంది సంపూర్ణంగా సహకరించాలని స్పష్టం చేశారు. జీఎస్‌డబ్ల్యూఎస్ డేటాకు, అసెస్మెంట్‌లకు, యూజర్ చార్జీలు చెల్లిస్తున్న వారికి మధ్య చాలా వ్యత్యాసం కనిపిస్తున్న నేపథ్యంలో ఈ సర్వేతో ప్రయోజనం ఉంటుందన్నారు. అలాగే వ్యాపార సంస్థలకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ ఉందో లేదో పరిశీలించాలన్నారు.

నిర్ణీత ప్రొఫార్మా ప్రకారం సర్వేను పూర్తి చేయాలని సూచించారు. పారదర్శకంగా సర్వే చేస్తే నమోదు కాని అసెస్మెంట్‌లు, ట్రేడ్ లైసెన్సులు తీసుకోని వ్యాపార సంస్థలు, యూజర్ చార్జీలు చెల్లించని కుటుంబాల సమాచారం బయటపడుతుందన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం. ఏసుబాబు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ సిరిల్, శానిటరీ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కులపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ కృతికా శుక్లా
- 'ఉమా' సొసైటీపై సమీక్ష

కాకినాడ సిటీ: ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో కాకినాడలో నిర్వహిస్తున్న జిల్లా పునరావాస నిర్వహణ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ కృతికా శుక్లా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ఈ సొసైటీ గత ఏడాది కార్యక్రమాలను సమీక్షించి, 2023–24 ఏడాది ప్రణాళికను రూపొందించి జిల్లా అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దివ్యాంగుల హక్కులపై అవగాహనలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలని కలెక్టర్ సూచించారు. విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా సహాయ సంచాలకులు వి కామరాజు మాట్లాడుతూ దివ్యాంగుల పునరావాసానికి అవసరమైన సేవలపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ సహకరిస్తామన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి మాట్లాడుతూ, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, డీఎంహెచ్ఓ ఆర్.రమేష్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె.ప్రవీణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ హేమలత, సాంఘిక సంక్షేమశాఖ జేడీ రంగలక్ష్మీదేవి, ఉమామనోవికాస కేంద్రం పీడీ కె.నారాయణరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

సంక్షేమంతో ప్రతి ఇంటా ఆనందం


మొండిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- మొండిలో గడప గడపకూ

కరప: సీఎం జగన్ అమలు చేస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొంది ప్రతి కుటుంబంలో ఆనందం సంతృప్తి వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ఉప్పలంక శివారు మొండిలో స్థానిక నాయకులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. కొన్ని ప్రాంతాల్లో వీధి కుళాయిలు వేయించాలని, డ్రెయిన్లు నిర్మించాలని కోరగా ఎమ్మెల్యే కన్నబాబు స్పందించి అన్ని సమస్యల పరిష్కారానికి తగినచర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అర్హత ఉండి, ఎవరికైనా సంక్షేమపథకాలు రాకపోతే గ్రామ వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సర్పంచ్ బొమ్మిడి నయోమి, ఎంపీటీసీ సభ్యుడు కాలాడి కామేశ్వరరావు, పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్, మాజీ సర్పంచ్ బొమ్మిడి శ్రీను, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది స్వాగతం పలికారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, ఎంపీడీఓ కర్రె స్వప్న, గ్రామ కార్యదర్శి ఎస్కే నాగేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటింటా ధర్మప్రచారం


కరపలో ధర్మప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు

కరప: దేశ సంస్కృతి, సంప్రదాయాలకు విఘాతం కలగకుండా ధర్మపరిరక్షణ ప్రతిఒక్కరూ కృషిచేయాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ పడాల రఘు పేర్కొన్నారు. స్థానిక నీలయ్య తోటవీధిలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విదేశీ సంస్కృతిని విడనాడి, స్వధర్మానికి మేలుచేయాలన్నారు. ధర్మాన్ని కాపాడేలా అందరిలో చైతన్యం తీసుకురావాలన్న ఉద్దేశంతో 14వ విడత ఇంటింట ధర్మప్రచారాన్ని నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. బుధవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు ధర్మప్రచారం కొనసాగుతుందని రఘు తెలిపారు. ధర్మప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కరప సబ్ డివిజన్ కన్వీనర్ ముమ్మిడి శ్యామ్‌సుందరరావు, మండల కన్వీనర్ కాదా సత్యనారాయణ, సహాయ కోకన్వీనర్ కొక్కిరమట్ల రామకృష్ణ, మండల మహిళా కన్వీనర్ పేకేటి లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గాదేవి ప్రతిష్ఠోత్సవం


కరపలోని కనకదుర్గ అమ్మవారు

కరప: స్థానిక హైస్కూల్ సెంటర్‌వద్ద దుర్గాదేవి ఆలయంలో బుధవారం కనకదుర్గ అమ్మవారి 35వ ప్రతిష్ఠా వార్షికోత్సవ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. గ్రామంలో పాడిపంటలు వృద్ధిచెంది, ప్రజలు సుఖశాంతులతో ఉండేందుకు దుర్గాదేవి ఆలయాన్ని నిర్మించినట్టు వారు తెలిపారు. 10వ తేదీన ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి, ప్రసాద వితరణ జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. కరప పరిసర గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు. బుధవారం హైస్కూలు ఆవరణలో మహాన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్టు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. కరప, పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

కరెంట్ అఫైర్స్ బుక్ ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్యామ్

బోట్‌క్లబ్: పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా కరెంట్ అఫైర్స్ 2023 రూపొందించినట్టు శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్ అన్నారు. స్థానిక శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో మంగళవారం ఈ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. పోలీసు ఉద్యోగాలకే కాకుండా ఇతర పోటీ పరీక్షలకు కూడా ఇందులోని అంశాలు ఎంతగానో ఉపయోపడుతుందన్నారు. జీవితంలో ఉన్నత స్థానాన్ని అధిష్టించాలన్న ఆకాంక్ష, ఏదో సాధించాలన్న తపన ఈనాటి యువతలో చాలా కనిపిస్తుందన్నారు. ఉద్యోగ లక్ష్యం వేరు, దాన్ని సాధించే వరకూ చేసే ప్రయత్నం వేరన్నారు. మంచి మార్కులు సాధించడానికి సమగ్రమైన స్టడీ మెటీరియల్ కూడా చాలా కీలకమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతీ మార్కు ఎంతో కీలకమన్నారు. విద్యార్థులు వంద మార్కులు సాధించేలా ఈ కరంట్ అఫైర్స్ రూపొందించామన్నారు. ఈ ఆవిష్కరణలో మదీనా, రమేష్, శేఖర్, నరేష్, శ్యామ్ ఇనిస్టిట్యూట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మల్లాడి శివరాం వర్ధంతి


మల్లాడి శివరాం నాయకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

కాకినాడ రూరల్: నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో దివంగత మల్లాడి శివరాం నాయకర్ రెండో వర్ధంతి నిర్వహించారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కమల కుమారి అధ్యక్షత వహించి మాట్లాడుతూ 'మహా దాత మల్లాడి సత్య లింగ నాయకర్' ఆశయాలను పుణికిపుచ్చుకున్న వంశపారంపర్య ధర్మకర్త, ఎంఎస్ఎన్ చారిటీ చైర్మన్ వ్యవహరించిన మల్లాడి శివరాం నాయకర్ ఎంతో ఉన్నతమైన వ్యక్తి అని, వారి పూర్వీకులు ఏ ఆశయంతో విద్యాలయాల అభివృధికి స్థలాలను కేటాయించారో వాటిని జాగ్రత్తపరుస్తూ వారి కృషిని కొనసాగించారన్నారు. ఆయన పేరు మీదుగా వర్సిటీ ఉన్నతాధికారుల సెమినార్ హాల్‌కు నామకరణం చేయడం హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిబాబు, వాసంసెట్టి శ్రీనివాస్, ప్రమీల, రాజ్ కుమార్, చైతన్య, రామకృష్ణ తదితర బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఉత్తమ ప్రతిభకు ప్రశంస


చోడిశెట్టి వెంకటలక్ష్మిని అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా


నరాల శ్రీరామచరణ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్



విద్యార్థినులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ సిటీ: ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమష్టి భాగస్వామ్యంతోనే అత్యుత్తమ ఫలితాలను నమోదు చేయవచ్చని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. మంగళవారం కాకినాడ పీఆర్‌జీ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థుల సత్కారంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. పెదపూడి మండలం సంపర గ్రామానికి చెందిన చోడిశెట్టి వెంకటలక్ష్మి 581, కొరుప్రోలు భువనేశ్వరి 578 మార్కులు సాధించడంపై ఆమె హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులకు మెమెంటోలు అందించి సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు విద్యాశాఖ జేడీ నాగమణి, డీఈవో అన్నపూర్ణ, సంపర జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం త్రిమూర్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ కృతికా శుక్లా ప్రశంసించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో వారికి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. 597 మార్కులు సాధించిన పవిత్ర ముగ్ధ, 595 మార్కులు సాధించిన జె.నిహారిక, 593 మార్కులు సాధించిన జి.రితికలను కలెక్టర్ అభినందించారు.

నరాల శ్రీరామచరణ్‌కు..

పిఠాపురం ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహం నంబర్–1లో పదో చదివిన నరాల శ్రీరామచరణ్ ఏప్రిల్–2023 ఎస్ఎస్‌సీ ఫలితాలలో 562 మార్కులు సాధించి జిల్లా స్థాయి వసతి గృహాలలో టాపర్‌గా నిలిచినందుకు కలెక్టర్ కృతికా శుక్లా మెడల్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లో ఎలా చదవాలో ముఖ్యమైన సూచనలిచ్చి విద్యార్థిని అభినందించారు. సాంఘిక సంక్షేమశాఖ జేడీ రంగలక్ష్మీదేవి, ఏఎస్‌డబ్ల్యూవో వై.రాణి, హెచ్‌డబ్ల్యూవో వై.వెంకట్రావు, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.వేణుగోపాల్, క్లాస్ ఉపాధ్యాయులు రాగం పాదాలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కన్నబాబు అభినందన

కాకినాడ రూరల్: పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన మండలంలోని పి.వెంకటాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అభినందించారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి పి.వెంకటాపురం గురుకుల పాఠశాల విద్యార్థినులు దడాల జ్యోత్స్న, సరిగోలు అక్షయడిసౌజ, పిట్టా అమృత వర్షిణిలను, ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుశీలను, అధ్యాపకులను రాష్ట్రస్థాయిలో పి.వెంకటాపురం గురుకుల పాఠశాలను నిలిపినందున అభినందనలు తెలియజేస్తున్నామని, ఇదే ఒరవడిని కొనసాగించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరుగురు లబ్ధిదారులకు రూ.13.43 లక్షలు సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, సీనియర్ నాయకుడు గోపిశెట్టి బాబ్జీ, పుల్ల చందు, కొప్పిశెట్టి గణేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై నేరాల నియంత్రణకు చర్యలు

కాకినాడ క్రైం: ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతలతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, మహిళల రక్షణ, బాలల భద్రత తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. మహిళలు, బాలలపై జరిగే నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు

జనసేన నాయకుల పర్యటన

కరప: మండలం పెదకొత్తూరులో మంగళవారం జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు పంతం నానాజీ స్థానిక నాయకులతో కలసి పర్యటించి జనం కోసం పవన్–పవన్ కోసం మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

12న బాస్కెట్ బాల్ క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం: ఈనెల 12వ తేదీన రామచంద్రపురంలో బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్టు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ పాలకొల్లు సమీపంలో ఉల్లంకుర్రులో నిర్వహించనున్న రాష్ట్ర యూత్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఈ ఎంపిక ఉదయం 7 గంటల నుంచి జరుగుతుందన్నారు. ఈ ఎంపికకు వచ్చే క్రీడాకారులు జనవరి ఒకటి 2007 తరువాత పుట్టిన వారై ఉండాలని రిజనల్ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తప్పని సరిగా తీసుకురావాలని ఆయన సూచించారు.

17 లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

సామర్లకోట: పదో తరగతి పరీక్షలు ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్ష రాసేందుకు ఈనెల 17వ తేదీ లోపుగా ఫీజు చెల్లించాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. మూడు సబ్జెక్టుల వరకూ రూ.110, మూడు సబ్జెక్టులు దాటితే రూ.125 ఫీజు చెల్లించాలన్నారు. రూ.50 అపరాధ రుసుంతో ఈనెల 22వ తేదీ వరకూ ఫీజు చెల్లించవచ్చునని తెలిపారు.